మరమ్మతులు చేశారు.. వినియోగం మరిచారు!

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు మరమ్మతులు చేయించిన కూటమి ప్రభుత్వం
- ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాని పరిస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



గుడేకల్‌లో మూలనపడ్డ చెత్త సేకరణ రిక్షాలు, ట్రాక్టర్



కందనాతి కేంద్రానికి తాళం వేసి లోపల మంచం వేసుకొని సేదతీరుతున్న యువకులు



కందనాతిలో చెత్త సంపద కేంద్రంలో బీరు సీసాలు

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో చెత్త సేకరించి దాని ద్వారా సంపద సృష్టించి పంచాయతీ ఆదాయం పెంచాలనే మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటికి మరమ్మతులు చేపట్టినా వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో మందుబాబులకు, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారాయి. అలాగే చెత్త సేకరణ కోసం ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చిన రిక్షాలు, ఆటోలు మూలనపడ్డాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది.

మండలంలో 17 కేంద్రాలు..

మండలంలో 17 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. ఒక్కోదానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షల వరకు వెచ్చించారు. పంచాయతీలను బట్టి కొలతల ఆధారంగా నిధులను ఖర్చు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల సమన్వయంతో ఈ కేంద్రాలను నడపాల్సి ఉంది. గ్రామాల్లో చెత్త బుట్టలను పంపిణీ చేసి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి చేత్త సేకరణకు వచ్చే వారికి ఇవ్వాలి. వీటి సేకరణకు ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్లు, రిక్షాలను పంపిణీ చేసింది. అయితే చెత్త రిక్షాలు నిర్వహణ లేక మూలనపడ్డాయి.

చెత్త సేకరణ ఇలా..

గ్రామాల్లోని ప్రజలు పంచాయతీ వారు ఇచ్చిన బుట్టల్లో వేర్వేరుగా తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలి. సేకరించిన చెత్తను కార్మికులు రిక్షాలు, ఆటోలు, ట్రాక్టర్లలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలకు తరలిస్తారు.కేంద్రాల్లో ఏర్పాటు చేసి సిమెంట్ తొట్టిల్లో చెత్త వేరు చేస్తారు. ప్లాస్టిక్ కవరులు, పేపర్లు, వస్తువులు, ఆట్టలు, సీసాలు, బట్ట ముక్కలు వేరు చేసి కేంద్రాల్లో నిర్మించిన సిమెంట్ తొట్టిలో వేర్వేరుగా నిల్వ చేస్తారు. ఈ చెత్తను విక్రయించి దానితో వచ్చిన ఆదాయాన్ని పంచాయతీకి జమ చేస్తారు. చెత్తతో సంపద సృష్టితో పాటు తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసి, రైతులకు విక్రయించి వచ్చిన నగదును పంచాయతీ ఖాతాకు జమచేయాల్సి ఉంది.

మరమ్మతులు చేసినా.. నిరుపయోగంగానే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు మరమ్మతులు చేయించారు. 17 పంచాయతీలకు గాను 11 పంచాయతీలు దైవందిన్నె, కె.తిమ్మాపురం, కలుగోట్ల, కడివెళ్ల, కందనాతి, గుడేకల్, కడిమెట్ల, దేవబెట్ట, మసీదపురం, కోటేకల్, మల్కాపురంలలో సంపద తయారీ కేంద్రాల మరమ్మతులకు రూ. లక్షలు ఖర్చు చేశారు. నిధులు ఖర్చు చేసి మరమ్మతులు చేసినా కేంద్రాలను నేటికి ఉపయోగంలోకి తీసుకురాకుండా నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..

ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాల ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారిపోయాయి. రాత్రి అయ్యిందంటే చాలు మందు బాబులు మంచి షెల్టర్‌గా ఉపయోగించుకొని తమ పనికానిస్తున్నారు. గ్రామ శివారు కాలనీల్లో షెడ్లను ఏర్పాటు చేయడంతో మందు బాబులతో పాటు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మరాయి. కేంద్రం చుట్టూ కంచె వేసినా వాటిని దాటుకొని వెళ్లి తమ పనులు కానిస్తున్నారు. చెత్త సంపద తయారు చేస్తే కొంత వరకు వీరి ఆగడాలను తగ్గించవచ్చునని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకువస్తాం

పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకువస్తాం. ఇప్పటికే రెండు చోట్ల చెత్త నుంచి ఎరువును తయారు చేస్తున్నాం. శిథిలమైన కేంద్రాలను మరమ్మతులు చేయించాం. టైర్లు పంక్చర్లు పడ్డ రిక్షాను షెడ్‌లో ఉంచాం. గ్రామీణులు సంపద తయారీ కేంద్రాలను ఇతర పనులకు వాడుకున్నట్లు మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, ఈఓఆర్డీ, ఎమ్మిగనూరు

క్లుప్తంగా

ఇరుముడితో శ్రీశైలానికి శివభక్తులు



ఇరుముడి కట్టుకుంటున్న శివమాలధారులు

ఆదోని అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబామల్లికార్జునస్వామివార్లకు నైవేద్యం పెట్టేందుకు శివమాలధారులు జ్యోతిర్ముడితో శ్రీశైలానికి తరలివెళ్తున్నారు. ఇరుముడి కట్టుకుని కొంతమంది భక్తులు ఆదోని నుంచి, ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుంచి పాదయాత్రగా వెళ్తున్నారు. మరికొందరు నేరుగా వాహనాల్లో తరలివెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి స్పర్శ దర్శనం చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం రాహుకాలం వెళ్లిన తర్వాత గురుస్వామి శైలేంద్రనాథ్‌తో జ్యోతిర్ముడి కట్టుకుని, శివమాలధారులు నెత్తిన పెట్టుకుని శంభులింగేశ్వరస్వామికి పూజలు చేసిన అనంతరం శ్రీశైలానికి బయలుదేరారు.

ఘనంగా సంత్ గాడ్గేబాబా జయంతి



సంత్ గాడ్గేబాబాకు నివాళులర్పిస్తున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోని సెంట్రల్: సంత్ గాడ్గేబాబా జయంతిని రజక ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి తన కార్యాలయంలో జరిగిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజంపై తార్కిక ఆలోచన విధానం, చైతన్య భావాలు కలిగిన మహా నాయకుడన్నారు. గొప్ప సంఘసంస్కర్తగా కొనియాడారు. కార్యక్రమంలో రజక ఉద్యోగ సంఘం నాయకులు నాగరాజు, నరసింహరాజు, కిశోర్, నాగరాజు, రవి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని మదిరె గ్రామంలో కోసిగి కిష్టప్ప అనే వ్యవసాయ కూలీ శనివారం ప్రమాదవశాత్తు గోడకూలి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. విషయాన్ని గ్రామ పెద్దలు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం మృతుని కుటుంబానికి తమ వంతుగా రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి గ్రామ నాయకుల ద్వారా కిష్టప్ప భార్య దేవమ్మ, పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామయ్య, వెంకటేష్, యంకప్ప పాల్గొన్నారు.

నేడు షాపుల యజమానులతో సమావేశం

గోనెగండ్ల : మండల కేంద్రంలో రోడ్డుకిరువైపులా ఉన్న షాపుల యజమానులు, చికెన్ షాపులు, కూరగాయల షాపుల వారితో సోమవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ అనంతసేన ఆదివారం తెలిపారు. స్వచ్ఛ గ్రామంగా మార్చుటకు షాపుల యజమానులకు స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా షాపుల వారికీ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

కౌతాళం: ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద ఇటీవల ప్రతిష్ఠించిన విజయ గణపతి ఆలయ అభివృద్ధి కోసం ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులు గణపతి విగ్రహ అభివృద్ధికి హైదరాబాదు వాస్తవ్యులైన ఈర్లదిన్నె హసీని వారి కుంటుంబ సభ్యులు రూ.1,00,100 నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, శివన్న స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వారం ఈర న్న తెలిపారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో ఫాగింగ్ మిషన్‌తో వార్డులలో పర్యటించి ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల గ్రామంలో దోమ లు విపరీతంగా పెరిగి జ్వరాలు ప్రబలుతుండడంతో ముందు జాగ్రత్తగా ఫాగింగ్ చేయించినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

కనులపండువగా బండేగురుడి ప్రభోత్సవం



జన సందోహం మధ్య బండేగురుడి ప్రభోత్సవం

నందవరం: మండలంలోని పూలచింత గ్రామంలో వెలసిన సద్గురు బండేగురువుల ప్రభోత్సవం మఠం పీఠాధిపతి జయశంకరప్ప స్వామి ఆధ్వర్యంలో జన సందోహం మధ్య కనుల పండువగా సాగింది. స్వామివారి 119వ ఆరాధాన వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పాటు విశిష్ట పూజలు గావించారు. ఉపపీఠాధిపతి బండేప్ప స్వామి ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, బండేగురుమూర్తికి(కాశీలింగానికి) రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూలు నిర్వహించారు. స్వామివారి పల్లకీని భజన, నంది కోలు సేవ, మంగళవాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పీఠాధిపతి జయశంకర స్వామి భక్తులకు ఆశీర్వాదం చేశారు. వీరభద్రస్వామి వేషధారణలో సాగిన ఖడ్గాధారణ, నందికోలు సేవ భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం 6:30 గంటలకు బండేగురు ప్రభోత్సవం అశేష భక్త జన సందోహం మధ్య గ్రామ వీధుల్లో కనుల పండుగగా సాగింది. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు వేలాది తరలివచ్చి వేడుకలో పాల్గొని గురువులకు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శాంతమల్లేశ్వరస్వామి, హోమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హోమాలు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని శాంతమల్లేశ్వరకొండలో వెలిసిన శాంతమల్లేశ్వరస్వామికి మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు గత వారం రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఆలయంలో ధన్వంతరి, హయగ్రీవ, రుద్ర, కాలభైరవ హోమాలు జరిగాయి. బుధవారం రోజున నూతనంగా స్థాపించిన కలశానికి 108 మంది జంటలతో కుంభాభిషేకం, మరుసటి రోజు శివపార్వతుల కళ్యాణం చిన్మయా మిషన్‌లో జరుగుతుందని చిన్మయమిషన్ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అల్లీ సాహెబ్ ఉరుసు





స్వామి వారి గుర్రాన్ని, ఊరేగిస్తున్న గ్రామస్తులు,అల్లిసాహెబ్ స్వామి దర్గాను దర్శించుకుంటున్న ఎర్రకోట జగన్

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కై రవాడి గ్రామంలో హజరత్ అల్లీ సాహెబ్ స్వాముల ఉరుసు మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారు జామున స్వామి వారి గుర్రాన్ని పెద్ద దర్గా నుంచి అల్లిసాహెబ్ స్వామి దర్గా వరకు ఊరేగించారు. ఊరేగింపు సమయంలో భక్తులు అడుగడుగునా స్వామి వారి గుర్రానికి పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండ పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు.

స్వామిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, బుట్టా శివనీలకంఠ వేర్వేరుగా వచ్చి హజరత్ అల్లీ సాహెబ్ దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. అలాగే ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందేనవాజ్, గడ్డం నారాయణ రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, పులికొండ, శీను, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



అల్లిసాహెబ్ స్వామి దర్గాను దర్శించుకుంటున్న బుట్టా శివ నీలకంఠ

సహస్ర దీపోత్సవం



శివలింగాకారంలో దీపాలు వెలిగించిన దృశ్యం

ఆదోని అర్బన్: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని శనివారం రాత్రి శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సహస్ర దీపోత్సవం జరిగింది. గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో శివమాలాధారణ భక్తులు, మహిళలు శివలింగాకారంలో దీపాలను వెలిగించారు. ముందుగా గురుస్వామి శైలేంద్రనాథ్ దంపతులు మంగళ హారతి గావించి అఖండ దీపాన్ని వెలిగించిన అనంతరం శివలింగాకారంలో ఉన్న సహస్ర దీపాలను శివనామస్మరణతో భక్తిశ్రద్ధలతో వెలిగించారు. కార్యక్రమంలో భక్తులు కాశీ విశ్వనాథ్ స్వామి, శంకర్‌స్వామి, నరసప్పస్వామి, మోహన్‌స్వామి, బసవస్వామి, కాశీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

28న భూ సమస్యలపై రాష్ట్ర సదస్సు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో తీవ్రంగా వున్న భూస మస్యలపై ఏబికేఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్య న్న పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆ సంఘ నాయకులతో కలిసి భూ సమస్యలపై నిర్వహించే రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లా డుతూ.. అభివృద్ధి పేరుతో పాలకులు విధ్వంసకర పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు నాగరాజు, నాగేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

కోసిగి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారి ఆదోని చెందిన నిర్వాహకురాలు నిర్మల, అమృతేశ్వరి అన్నారు. ఆదివారం మహాశివరాత్రిని పురస్కరించుకుని కోసిగిలో ప్రజాపితి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో శివలింగం, కలశాలు, మేళతాళాలతో పురవీధుల గుండా శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఈశ్వర దేవాలయం నుంచి శివలింగాన్ని ఆటోపై కొలువుంచి స్థానిక దొరలచావిడి మీదుగా బస్టాండ్ నుంచి ఆలయం చెంత వరకు ఊరేగించారు. కార్యక్రమంలో ఆదోని ఓంశాంతి బృందం గిరెప్ప, కోసిగి నిర్వాహకురాలు కృష్ణమ్మ, భక్తులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో రక్తదాన శిబిరం

ఆదోని సెంట్రల్: రాయలసీమ అధ్యక్ష మండల బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి. ఐజక్ వరప్రసాద్ తండ్రి నాల్గవ గ్రేషస్ డే సందర్భంగా సీఎస్ఐ క్రైస్ట్ చర్చ్‌లో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఏడీపీ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని చర్చ్ కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో 30 మంది దాక రక్తదానం చేశారని, వందమందికి పైగా బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి సీఎస్ఐ పాస్టర్ విలియం సుజిత్ మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు శ్రీకాంత్, ఏజే ప్రసాద్, అమృత్, సౌజన్య కుమారి యూత్ సభ్యులు సునిల్, కార్తీక్, ఆశోక్, మైలర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ జాతర



కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోసిగి: కోసిగి ప్రజల ఆరాధ్య దైవం. కొలిచే వారి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రేణుక ఎల్లమ్మ దేవి జాతర ఆదివారంతో ముగిసింది. ఈనెల 15న ప్రారంభమైన జాతర ఉత్సవాలు 9 రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఆదివారం రాత్రి ఆలయ అర్చకులు గౌరీష్ గౌడ, మూర్తి గౌడల ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమను పల్లకీలో కొలువుంచి కలశాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపు ఊరువాకిలి మీదుగా దొరల చావిడీ సమీపంలో అమ్మవారి పూజారుల స్వగృహం వరకు తీసుకెళ్లి పూజలు చేసి భద్రత పరిచి ఉత్సవాలకు ముగింపు పలికారు.

కూటమి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాలలో పైకప్పు శిథిలమైన గదులు, కూటమి ప్రభుత్వం పూర్తి చేయని అసంపూర్తి భవనాలను పరిశీలించారు. పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ తరగతి గదుల పైకప్పు శిథిలమై పెచ్చులూడిపోవడంతో ఎవరిమీద పడుతాయోనని విద్యార్థులు భయాందోళనలు చెంతున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయలేకపోతోందన్నారు. నాడు- నేడు కింద గత ప్రభుత్వం 20 తరగతి గదులు మంజూరు చేయగా వాటిలో 8 గదులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 12గదుల నిర్మాణాలు నిలిచిపోయాయని చెప్పారు. విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆయా భవనాలను సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

బుట్టా ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక సహకారంతో బుట్టా ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని బుట్టా శివనీలకంఠ తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు ప్రజలకు ఏ అవసరమైన బుట్టా ఫౌండేషన్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, రాష్ట్ర శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని నాగరాజు, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ నారాయణ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు విరూపాక్షిరెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1975వ సంవత్సరం బీకాం చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బెంగళూరులో ఘనంగా జరిగింది. 50 ఏళ్ల తర్వాత కుటుంబాలతో కలుసుకోవడం, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకోవడం చాల సంతోషంగా ఉందని రమేష్, రాఘవేంద్ర ఆచార్ తెలిపారు. అందరినీ ఒకచోట చేర్చి ఆత్మీయంగా పలకరించుకోవడానికి సమన్వయ కర్తగా వ్యవహరించిన గద్వాల్ ఈరన్నను అభినందించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

నందవరం: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు పరిశుభ్రత, చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే వీధులు, డ్రైనేజీలు, నీటి కుంటలలో మురుగును ఎప్పటికప్పుడు శుభ్రంగా చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు ఇంట్లో చెత్తబుట్టలు వాడాలని, పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలన్నారు. వారు చెత్త తీసుకెళ్లి చెత్త సంపద కేంద్రాలలో తడి, పొడి చెత్తలను వేరు చేస్తారని వివరించారు. అలాగే ఈ సంపద కేంద్రాల ద్వారా పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి షాహిద్ పాల్గొన్నారు.

డస్ట్ బిన్ల పంపిణీ

గోనెగండ్ల: మండల పరిధిలోని పుట్టపాశం గ్రామంలోని ప్రజలకు ఆదివారం డీఎల్‌పీఓ నూర్జహాన్ డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా పుట్టపాశం గ్రామంలో ఇంటింటికీ డస్ట్ బిన్‌లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పనితీరుపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, సర్పంచ్ శంరకమ్మ తదితరులు పాల్గొన్నారు.